# పోస్టు చెయ్యని ఉత్తరం

తులికా భూషణ్

"నాకు గుండె జబ్బు.

"మొదటిసారి ఎవరో పుణ్యాత్ములు నన్ను ఆస్పత్రిలో చేర్పించారు.

ఆ పుణ్యాత్ముల దయ కావచ్చు. భగవంతుని లీలా వినోదం కావచ్చు. నా కర్మ ఇంకా పూర్తిగా పరిపక్వం కాకపోయి ఉండవచ్చు. ఏమైనా బ్రతికి మళ్ళీ బట్టకట్టాను.

ఎప్పుడో. ఎక్కడో దిక్కులేని చావు చస్తాను.

అప్పుడు ఈ ఉత్తరం ఎవరి కంట నయినా పడక తప్పదు.

దీనితోబాటు వంద రూపాయల కాగితం ఒకటి జతచేసి వుంచుతాను.

ఏ పుణ్యాత్ముడిచేత ఈ ఉత్తరం. నోటు పడతాయో ఆ పుణ్యాత్ముడికొక ప్రార్థన.


బాబూ! ఈ ఉత్తరం రిజిష్టర్ పోస్టులో నా కూతురికి పంపించు. పోస్టు ఛార్జీలు పోను మిగతా డబ్బు నీది. వాడుకో.

వచ్చే జన్మలో నీ కడుపున పుట్టి నీ ఋణం తీర్చుకొంటాను."

* * *

సీతాపతిని గుండె జబ్బు చంపలేదు.

విజయవాడలో బస్సు స్టేషన్ ఎదురుగా



"మళ్ళీ ఏ నిమిషంలో అయినా ఇది దెబ్బ కొట్టవచ్చు. చెప్పలేము"- అన్నారు డాక్టర్లు.

నామట్టుకు నేను సిద్ధంగా ఉన్నాను. ఇంక దేనికీ చింతించవలసిన అగత్యం నాకు లేదు. నేను నిర్వర్తించవలసిన బాధ్యత ఏమీ లేదు ఆ మాటకు ఎంతటి చిన్న బాధ్యత నైనా నిర్వర్తించగల శక్తి సామర్థ్యాలు నాకు లేవు కూడా.

నా కోసం చింతించేవాళ్ళు లేరు. కాని—

ఇంతటి నిస్పృహాయ స్థితిలో నైతం నా ప్రాణం ఒక్కరికోసం— కేవలం ఒక్కరికోసం మాత్రం పరితపిస్తూ ఈ బొంది విడిచిపోవడానికి నిరాకరిస్తూ ఉంది.

ఆ ఒక్కరు నా కుమార్తె. నా కడ గొట్టు కుమార్తె. గాడాబంగా పెరిగిన నా ముద్దుల బిడ్డ.

అన్నిటికన్నా బాధాకరమైనది అన్యాయమైపోయిన కూతురు.

అన్నిటిని మించి ప్రాణంకన్న మిన్నగా ప్రేమిస్తూ ఉన్నా నన్ను అవమానించిన నా కన్నబిడ్డ.

ఆ బిడ్డ మనశ్శాంతి కోసం. నా ఆత్మ శాంతి కోసం:ఈ లేఖ వ్రాస్తున్నాను. నాకు తనమీద కోపం లేదని. జాలితో నా హృదయం ద్రవిస్తూందని. కనీసం నా మరణానంతరమైనా ఆమె జీవితం మార్పు చెంది. ఆమెకు సుఖశాంతులు ప్రసాదించాలని పరమేశ్వరుని ప్రార్థిస్తున్నానని తెలియజేస్తూ ఆమెకు వ్రాసిన లేఖ ఇది.

నేను చనిపోయిన తరవాత కాని ఈ ఉత్తరం నా కూతురు కంట పడరాదు. అందుచేత పోస్టు చెయ్యకుండా జేబులో పెట్టుకొని దేశ సంచారం చేస్తున్నాను.

నేను ఎప్పుడు పోతానో తెలయదు.

రోడ్డు దాటుతూ ఉండగా కారు గుద్దేసింది.

సీతాపతి అక్కడికక్కడే ప్రాణం కోల్పోయాడు.

పట్టపగలు దాదాపు ఒక వంద మంది అయినా హృదయ విదారకమైన ఆ సంఘటనకు ప్రత్యక్ష సాక్షులు అయి వుంటారని చెబితే అతిశయోక్తి అని ఎవరూ ఆక్షేపించవలసిన అవసరం ఏమీ లేదు.

వారిలో భవదీయుడు ఒకడు-అంటే నేను ఒకణ్ణి.

సీతాపతి పడిపోయి నాలుగు అయిదు నిమిషాలు అయి ఉంటుంది. అప్పటికి అక్కడి జనాన్ని తిరిగి చైతన్యం ఆవహించింది

ఈలోగా సీతాపతిని గుద్దేసిన కారు డ్రైవరు రోడ్డుమీది జనం దిగ్భ్రమ చెంది చేష్టలు ఉడిగి ఉండడం గమనించాడు.

## ఆశ - నిరాశ

నా బ్రతుకంతా కష్టాలు
నా కళ్ళనిండా కన్నీళ్ళు
నా గుండె నిండా వ్యథ
ఇలా సాగుతుంది నా కథ!
ఎవరికైనా చెప్పుకుని
నా బాధల్ని, బాధ్యతల్ని
పంచుకునే తోడుగా
కలకాలం ఉంటారని
ఎదురు చూస్తున్నా ఆశగా
మళ్ళీ నా పిచ్చి భ్రమకి
నిట్టూరుస్తున్నా నిరాశగా

—'స్వప్న'

యజమానిని రక్షించాలని సంకల్పించాడు.

కారు వెనక్కి పదిగజాలు మళ్ళించాడు. మళ్ళీ ముందుకు వచ్చి నేలకరిచిన సీతాపతిని తప్పుకొని కారును శరవేగంతో ముందుకు ఉరికించాడు.

నాలుగయిదు నిమిషాల పుణ్యకాలం ముగిసింది. ప్రకృతంలో పడ్డ జనం విరుచుకుపడ్డారు.

కారుకు అడ్డం తగిలి బస్సు స్టేషన్ గోడకు తాపడం చేయించారు. నాలుగు జతల చేతులు కారుడ్రైవర్ని కారులోంచి బయటికి లాగి నేల కరిపించాయి.

రెండు వైపులనుంచి దూసుకువచ్చిన నాలుగు డజన్ల చేతులు కారులోవెనకసీట్లో ప్రాణం చేతబట్టుకు కూర్చున్న యజమానిని బయటికి లాగి దేహశుద్ధి కార్యక్రమం యథాశక్తి శాస్త్రోక్తంగా ప్రారంభించారు.

ఈలోగా పోలీసులు రంగప్రవేశం చేశారు.

అదొక గాథ. దానితో మనకు ప్రస్తుతం నిమిత్తం లేదు.

ఈలోగా ఒక పుణ్యాత్ముడు సీతాపతివద్దకు పరుగెత్తాడు. ఎవరినో పిలిచి సోడా కొట్టించి తెప్పించాడు. మరొక సోడాకు అతడినే పరిగెత్తించాడు.

సీతాపతి మీదికి వంగి సోడా నీరుతాగించే నిరర్థకమైన నటన నిపుణంగా సాగించాడు. చచ్చినవాడు సోడా తాగగలడా మరి!!

సీతాపతి మీదికి వంగిన దయార్ద్రహృదయుడైన ఆ నటశేఖరుడు ఒడుపుగా సీతాపతి చిరిగిన చొక్కా జేబులోంచి ఒక కవరు సంగ్రహించాడు సమయం చూసి. అంతే ఒడుపుగా సహాయ కార్యక్రమ నిర్వహణ భారం అప్పటికే సీతాపతి చుట్టూ మూగిన ఇతరులకు అప్పగించి బయటపడ్డాడు.

హైదరాబాదు రావడానికి ప్రైవేట్ బస్సులో కూర్చున్న నేను దిగి నాలుగడుగులు వేశానో లేదో- అతగాడు మా బస్సు ఉన్న సందులో ప్రవేశించాడు.

నా దృష్టి సీతాపతి మీద కేంద్రీకృతమై ఉండడం. మరొకరెవరూ తనను గమనించకపోవడం అతడి ఆత్రాన్ని పట్టపగ్గాలు లేకుండా చేశాయి.

సందులో అడుగుపెట్టిన తరువాత అతడినే గమనిస్తున్నాను నేను. ఆత్రం అధికంగా ఉండేమో అది గుర్తించే తెలివి అతడిలో నశించింది.

సీతాపతి జేబులోంచి సంగ్రహించిన కవరు పరిశీలించాడొకసారి.

"పాపం పిచ్చివాడు!" అని గొణుక్కున్నాడు.

"ఇలాంటి కేసు రోజుకొక్కటి తగిలితే చాలు నా సామిరంగా — మందుకి కొదవ వుండదు. ముసలి పిచ్చోడికి జై!" అనుకొంటూ ఆకవరు సైడు కాలవలోకి విసిరేసి మాయమయ్యాడు.

తడిసి ముద్దకాకుండా ఆ కవరు పట్టుకున్నాను. మళ్ళీ బస్సు ఎక్కాను. అప్పటికి బస్సులో జనం సీతాపతి చుట్టూ వున్నారేమో సావకాశంగా, నిశ్చింతగా ఆ కవరుకి గుదిగుచ్చిన ఉత్తరాన్ని, కవరులో ఉత్తరాన్ని చదవడం ప్రారంభించాను.

కవరు సంగ్రహించిన పుణ్యాత్ముడి మాటల్ని బట్టి వంద రూపాయల నోటు అతడి మందుకు ఉపయోగపడుతుందని ప్రత్యేకంగా చెప్పనక్కరలేదు.

మిగిలినది కవరులో ఉత్తరం.

* * *

అమ్మా, సుశీ.

ఆశీస్సులు. నువ్వు, అల్లుడు చి॥ రంగనాథం క్షేమమని తలుస్తాను.

ఆ రోజు నీకు కనిపించకుండా, చెప్పపెట్టకుండా వచ్చేశాను. చూడాలనే కోరిక ఎంత బలంగా వున్నా ఇంత కాలమూ నీకు దూరంగానే ఉండిపోయాను. అది ఎంతటి బాధాకరమైనదో ఎలా చెప్పగలను? ఏ రోజో ముందు నీకే తెలుస్తుంది.

ఏ జన్మలోనో, ఈ జన్మలోనే కావచ్చు కాదనను—ఎన్నో మహా పాపాలు చేశాను? శిక్ష అనుభవిస్తున్నాను తప్పుతుందా మరి! తల్లీ!

నీ జీవితం సుడిగుండంలో పడడానికి ఈ పాపాత్ముడే — నన్ను తండ్రి అని పిలిచే బదులు పాపాత్ముడంటే నిజానికి దగ్గిరగా ఉంటుంది- కారకుడు.

శక్తి లేనప్పుడు కట్నం ఇవ్వడానికి అంగీకరించనప్పుడు తల తాకట్టు పెట్టి అయినా ఇవ్వక తప్పదు.


రెండు తప్పులూ చేశాను. ఫలితం నువ్వు అనుభవిస్తున్నావు. మానసికంగా రంపపు కోత నేననుభవిస్తున్నాను.

ఇంతకూ నా జీవితంలో చరమాధ్యాయంలో జరిగినదిది.

ఆ రోజు నా జీవితంలో కెల్లా భయంకరమైన రోజు—

నిన్ను తీసుకొని భర్త వద్ద దిగవిడిచి వెళ్ళడానికి బయలుదేరాను.

భర్తకు నా పట్ల పేరుకొని ఘనీభవించిన కోపం, ద్వేషం ఏ స్థాయిలో ఉన్నది తెలుసుకొని కూడా సూచనప్రాయంగా అయినా నాతో చెప్పడానికి నువ్వు సంకో



చించావు. నేను బాధపడితే చూడలేక అలా చేసి ఉంటావని భావించి ఆ తరువాత సరిపెట్టుకోక నేను చేయగలిగినదిఏముంది?

రిక్షాలో మీ ఇల్లు చేరాము. ఎక్కడికి వెళ్ళాడో. ఏమో మనం రిక్షా దిగుతూ ఉండగా మీ ఆయన వచ్చాడు.


మొదట నిన్ను చూశాడు కాబోలు— ముఖం ఆనందంతో వెలిగిపోయింది.

ఆ తరవాత నా పాపిష్టి ముఖం కంట పడి ఉంటుంది—కళ్ళు కోపం జీరలతో ఎరుపెక్కాయి ఆ కోపంతో ముఖం కమిలిపోయింది.

నిన్ను లోపలికి తీసుకువెళ్ళాడు. సామాను లోపల పెట్టించి. రిక్షా ఆసామికి డబ్బులిస్తున్నాను.

అప్పుడు రిక్షా దగ్గరికి వచ్చావు. నీవెనక నీ భర్త గుమ్మంలో నిలబడి నా వంక కొరకొర చూస్తున్నాడు.

నువ్వన్నావు— 'నాన్నా మరో అరగంటలో మన ఊరు డైరెక్టుగా పోయేబస్సు ఉందని మీ అల్లుడుగారు చెబుతున్నారు. ఇక్కడ ఇళ్ళు దొరకడం చాలా కష్టం. అతి ప్రయత్నంమీద ఒక గది సంపాదించి దానిలో ఎలాగో కాలం గడుపుతున్నాము.




ఏమీ అనుకోకు. బాధపడకు.

రిక్షా పంపించేయకు. దానిలో బస్సుస్టాండుకు వెళ్లు' అని స్పష్టంగా వివరించావు.

ఆ క్షణంలో నీ కళ్ళలో నీరు చూశాను. ఆ కన్నీరు కంటబడడంకూడా భ్రమ కాకూడదని వేయి దేవుళ్ళకు మొక్కుకొన్నాను.

అప్పుడు జరుగుతున్నదంతా పగటి వేళ జాగ్రదవస్థలో నడుస్తున్న పీడకలలా తోచింది.

చేష్టలు వుడిగి నిలబడినట్లు కనుపించి వుంటాను—కంగారు పడ్డావు.

"వెళ్ళిపో. నాన్నా! వెళ్ళిపో" అంటూ నా జేబులో ఒక నోటు కుక్కావు. చేయి పట్టుకుని రిక్షా ఎక్కించావు.

రిక్షా బయలుదేరడం తరవాయి- నేను




★ నకిలీవిగాని, దెబ్బతిన్నవిగాని మరియు పాత సరుకునుగాని కొనుగోలు చేయకుండా. చిరకాలంగా నమ్మకమైన "రూపమ్స్ & రూపమ్స్ గ్రాండ్ బజార్" షోరూముల్లోనే షాపింగ్ చేయ ప్రోత్సహించండి!

దిరిగి చూడకుండా ఇంట్లోకి వెళ్ళిపోయి తలుపు వేసుకొన్నావు.

అది చిన్న దెబ్బకాదు నాకు. చావు దెబ్బ. గుండెకు సూటిగా తగిలిన దెబ్బ. తిరిగి మన ఇల్లు- అంటే నీ పెళ్ళి కాక ముందు మన ఇల్లు— చేరుకోవడం తడవుగా పడిపోయాను.

ఎవరో పుణ్యాత్ములు ఆస్పత్రిలో చేర్చారు. బతకనని పెదవి విరిచారు డాక్టర్లు.

పాపీ చిరాయుః అన్నారు పెద్దలు. బ్రతికి బట్టకట్టాను.

కన్న కూతురి నోటి వెంట "ఛో, నాన్నా!" అనిపించుకొన్న నేను పాపాత్ముడినేనని రుజువు చేయడానికిది చాలదూ?

ఇక ఆఖరి సంఘటన.

"సుశీ సీరియస్.. స్టార్ట్ ఇమ్మీడియెట్లీ" అంటూ మీ ఆయన ఇచ్చిన టెలిగ్రామ్ అందుకొన్నాను.

ఎలా తట్టుకొన్నానో ఆ పెరుమాళ్ళకే ఎరుక. బయలుదేరాను.

నేను ఇల్లు చేరుకొనేసరికి చీకటిపడింది. తలుపువేసి ఉంది. తట్టేలోగా లోపలినించి బిగ్గరగా మీ ఆయన మాట్లాడుతూ ఉండడం వినిపించింది.

"ఒక్క అనుభవం చాలదే నీ బాబుకి. పాపిష్టిముండాకొడుకు. పైగా అబద్ధాల కోరు.

"కట్నం ఇస్తానని చెప్పాడు. ఎగ్గొట్టాడు...."

సుశీ కలగజేసుకొంది.

"పదివేలు ఇస్తానన్నాడు. తొమ్మిదివేలు ఇచ్చాడు. ఒక్క వెయ్యిమాత్రమే కదండీ బాకీ?" అంది.

అల్లుడుగారి గొంతు తారస్థాయి అందుకొంది.

"వెయ్యికాదు. ఒక్కపైసా తేడా వచ్చినా సహించే అలవాటు మా ఇంటా వంటా లేదు.

"రానీయి నీ బాబుని.

ఇల్లు అమ్మి ఇస్తాడో. చచ్చి ఇస్తాడో నాకు తెలియదు. తెలుసుకొనే అవసరమూ లేదు.

వడ్డీతో సహా నా వెయ్యి రూపాయలు కక్కమను. లేకపోతే ఊరుకొనేది లేదు. జాగ్రత్త" అన్నాడు.

కొంచెంసేపు నిశ్శబ్దం రాజ్యం ఏలింది.

"నేనేం చెయ్యనండి? చెప్పగలను అంతే కదా?!" అంది సుశీ.

"అందుకే కదే నీకు సీరియస్‌గా ఉందని టెలిగ్రామ్ కొట్టాను! రానీ. అబ్బా కూతురు ఏమి చేస్తారో- నాకు అనవసరం. నా డబ్బు నాకు రావాలి అంతే" అన్నారు అల్లుడుగారు.

సుశీ మాట్లాడలేదు.

తరవాత పళ్ళేల చప్పుడు వినిపిస్తోంది.

నాకు తల తిరిగిపోయింది. కళ్ళు బైర్లు కమ్ముతున్నాయి. ఇంక కొంచెంసేపు ఆ గుమ్మం ముందు నిలబడి ఉంటే నాగతి ఏమౌతుందోనని భయపడ్డాను.

మళ్ళీ గుండె దెబ్బ తింటే?

నీమీద. నీ భర్తమీద ఆధారపడి బ్రతికి వుండగానే కుక్కచావు చావవలసివస్తుందేమో అని భయపడ్డాను.

తలుపు చప్పుడయితే గుమ్మంవిడిచి చీకట్లోకి తప్పుకొన్నాను.

నువ్వు కనిపించావు.

నడకలో. ముఖంలో ఎక్కడా రోగ చిహ్నాలు లేవు. నిక్షేపంలా ఉన్నావు. ముఖంలో విచారచిహ్నం సైతం కనిపించ లేదు.

అల్లుడుగారి ప్రవర్తన నాకు బాధాకరం కాలేదెన్నడూ.

అల్లుడుగారితో చేతులు కలిపి నా కుమార్తె ఆడిన ఈ నాటకం నాకు ప్రాణాంతకంగా పరిణమించింది. వెంటనే చచ్చిపోతే నా అంతటి ధన్యుడు ఈ ప్రపంచంలో మరొకడు ఉండడు.

అమ్మా! కన్నతండ్రి ఎలాంటివాడయినా అతడి ప్రాణంతో చెలగాటమాడడం న్యాయం కాదమ్మా- అందులోనూ డబ్బు కోసం.

అప్పుడొక నిశ్చయానికి వచ్చాను.

మిగిలిఉన్న ఆస్తి ఒక ఇల్లు. అదైనా పాత కొంప. తనఖాలో ఉంది అమ్మితే ఏమి వస్తుందో. అప్పులుపోను ఎంత మిగులుతుందో తెలియదు.

నీ పెళ్ళికి అయిన అప్పులవి.

మీ ఆయనా, నువ్వూ మాట్లాడుకోవడం విన్నాక ఇంక మిమ్మల్ని చూడాలనిపించ లేదు.

వెనుదిరిగి వచ్చేశాను.

ఇల్లు అమ్మగా మిగిలినది పదకొండు వందల చిల్లర.

మీ ఆయన పేర డిమాండు డ్రాఫ్టు పంపించాను.

వడ్డీ కట్టలేకపోయాను. మన్నించమని మీ ఆయనని ప్రార్థించానని నా మాటగా


## ప్రేమ మడిగుండం

గుసుస్తుంది ప్రతిరోజూ
యమగండంలా,

నీ ప్రణయ తీరం చేరాలనే
తహతహలో!

విన్నటిదాకా నీ
ఆలోచనల వరవడిలో
మునుగుతూ, తేలుతూ
కాలాన్ని, నా సర్వాన్ని మైమరచి
నా హృదయాన్ని నీవైపే నడిపించాను
ప్రేమ అనే తీరం మవ్వేనమకొని.
కాని, నీ గుండె అనంత సాగరం,
నీ ప్రేమ కనిపించని
మదూర మడిగుండం!
అయినా పయనిస్తున్నా గుడ్డిగా!
నీ ప్రేమతీరం చేరాలని ఆశగా!!

—సుశీల



మనవిచెయ్యి.

సుశీ! నీకు ఒక్క మాట—

జన్మజన్మలకీ నావంటి తండ్రి కడుపున పుట్టరాదని భగవంతుని ప్రార్థించు.

నీ తండ్రి.
"సీతాపతి"

* * *

తండ్రి అంటే ప్రేమలేని సుశీలకు ఈ ఉత్తరం పంపడంలో పరమార్థం ఏముంది?

వందరూపాయల నోటు ఏ పుణ్యాత్ముడి మందు కోసం సీతాపతి నిలవ ఉంచాడో అతడికి దక్కింది.

ఉత్తరం నా చేత పడింది.


నలుగురితో పంచుకొంటే తప్ప నాకు ఊరట చేకూరదు.

అదే చేశాను.

సీతాపతి ఆత్మకు శాంతి చేకూరదు. నేను చేయగలిగినది ఏమీ లేదు.

సీతాపతీ! నన్ను మన్నించడానికి నువ్వు లేవు. మీరు సుశీలకు మాత్రం ఈ ఉత్తరం సంగతి చెప్పవద్దు.

సెలవు.







అన్ని ముఖ్య పట్టణాలలో మా బ్రాంచీలు కలవు.

విశాలాంధ్ర
పబ్లిషింగ్ హౌస్
1984 నవలల పోటీ

మొదటి బహుమతి: రూ. 4,000
రెండవ బహుమతి: రూ. 3,000
మూడవ బహుమతి: రూ. 2,000

పోటీ ముగింపు: 30 ఏప్రిల్ 1984
ఫలితాల ప్రకటన: 22 జూన్ 1984

వివరాలకు: మేనేజర్
విశాలాంధ్ర
పబ్లిషింగ్ హౌస్
చంద్రం బిల్డింగ్స్, విజయవాడ-4